క్లుప్తంగా

కంటి వైద్య శిబిరం



పనసపాడులో పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

సామర్లకోట: మండలంలోని పనసపాడు పాత పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని ఆ గ్రామ సర్పంచ్ చీకట్ల వెంకటేష్ ప్రారంభించారు. వాసన్ కంటి ఆసుపత్రి వైద్యులు 105 మందికి పరీక్షలు చేశారు. ఆరుగురికి శస్త్రచికిత్సలు చేయాలని గుర్తించారు. కొందరికి కంటి అద్దాలు అవసరమన్నారు. ఆ ఆసుపత్రి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి ముసలయ్య, సచివాలయ సిబ్బంది రోగులకు సేవలందించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న కమిషనర్, చైర్‌పర్సన్ తదితరులు

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేట స్పెషల్ ఎలిమెంటరీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు వీరన్న దంపతులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వీరన్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంకవ్వడంతో ఈ సత్కారం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి, మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య, వైస్ చైర్మన్ జాన్ మోజెస్ పాల్గొన్నారు.

బాధితులకు సాయం

సామర్లకోట: ఇటీవల స్థానిక బలుసులపేటలో ఇల్లు కూలిపోవడంతో మూడు కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ఆ కుటుంబాలకు శుక్రవారం ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్ రూ.10 వేల సాయం చేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు దసరా నృత్య మహోత్సవం

బోట్‌క్లబ్: నృత్యాంజలి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ దసరా నృత్య మహోత్సవం శక్తి పురస్కార్ 2025 ప్రదానోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ హరిగురు శరవణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలు రాజా ట్యాంకు పార్కులో ఉన్న గోదావరి కళాక్షేత్రంలో నిర్వహిస్తామన్నారు. దీనికి ముఖ్య అతిథిగా కేంద్ర సంగీత, నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రామలింగ శాస్త్రి హాజరు కానున్నట్లు చెప్పారు.

సంచోరిస్తున్నారు!

- దొంగలకు కేంద్రంగా పిఠాపురం
- చోరీలతో భయపడుతున్న జనం
- దోపిడీలు, హత్య ఘటనలతో హడల్

దొంగలు.. ఇది నా అడ్డా అంటున్నారు.. అందినకాడికి దోచుకుపోతున్నారు.. ఇళ్లను గుల్లచేసి జనాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.. ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పిఠాపురంలో స్వేచ్ఛగా సంచరిస్తున్నారు.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎప్పుడూ లేనంతగా దోపిడీలు, దొంగతనాలు పెరిగిపోయాయని ప్రజలు అంటున్నారు. నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇలాకాలో ఈ పరిస్థితిపై అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. ఆ కథేంటో చూద్దాం రండి..



చోరీకి గురైన లారీలను పట్టుకున్న పోలీసులు (ఫైల్)

పిఠాపురం: నిత్యం జనంతో రద్దీగా ఉండే పిఠాపురంలో తిరగాలంటేనే భయమేసే పరిస్థితులు వచ్చాయి. అందరూ చూస్తుండగానే చేతిలో సెల్ ఫోన్లు మాయమవుతున్నాయి. బైక్‌లు బయట పెట్టి లోపలకు వెళ్లి తిరిగి చూస్తే కనిపించకుండా పోతున్నాయి. పట్టపగలే దాడి చేసి మరీ దోపిడీలు చేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. పలు సెల్ ఫోన్లు, మోటారు సైకిళ్లు, చివరకు లారీలు చోరీ చేస్తున్నారు. దారి దోపిడీలకూ తెగబడుతున్నారు. ఇళ్ల వద్ద పెట్టుకున్న వాహనాలు మాయం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసుల గస్తీ నామమాత్రమే అయ్యింది. రాత్రి సమయాల్లో గస్తీ తిరగడం పూర్తిగా ఆపేశారు. దీనివల్ల చీకటి పడితే గంజాయి బ్యాచ్‌లు విచ్చలవిడిగా తిరుగుతూ రోడ్లపై హల్‌చల్ చేస్తున్నా పట్టించుకునే నాథుడు కనిపించడం లేదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఏదైనా భారీ దొంగతనం జరిగాక దర్యాప్తు చేయడంలో చూపిస్తున్న చొరవ దొంగతనాల నివారణలో మాత్రం కనిపించడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పోలీసు బృందాలు ఏం చేస్తున్నట్టో?

చోరీలు, దోపిడీలు జరిగాక ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామంటూ పోలీసులు ప్రతి కేసులోనూ ప్రకటిస్తున్నారు. ఎప్పుడు ఉండే ఈ బృందాలు దోపిడీలు, దొంగతనాలు జరిగాక పట్టుకోవడం తప్ప, జరగకుండా ఎందుకు ఆపలేక పోతున్నాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దొంగలను పట్టుకోవడానికి ఏర్పాటు చేస్తున్న పోలీసు బృందాలు దొంగతనాలు జరగకుండా చూసేందుకు ఉపయోగిస్తే మంచిదన్న వాదనలు వినిపిస్తున్నారు.

మచ్చుకు కొన్ని ఘటనలు

ఇటీవల అనేక సంఘటనలు కలవరానికి గురిచేస్తున్నాయి. చేబ్రోలులో ఓ మృతదేహం లభ్యం కావడం.. ఇక్కడ తాటిపర్తికి చెందిన వ్యక్తిని పాయకరావుపేట ఎక్సైజ్ పోలీసులు నకిలీ మద్యం కేసులో అరెస్టు చేయడం.. చెందుర్తి వద్ద వెండి, బంగారు నగల వ్యాపారిని దోపిడీ చేయడం.. పిఠాపురంలో రెండు లారీలు చోరీకి గురికావడం వంటి సంఘటనలు నియోజకవర్గంలోనే జరిగాయి. మరోపక్క గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఇద్దరు వ్యక్తుల హత్య, మరో వ్యక్తిపై హత్యాయత్నం చేసిన సంఘటన ప్రజలను ఆందోళనకు గురి చేసింది. పిఠాపురంలో రద్దీగా ఉండే ఉప్పాడ బస్టాండ్ సెంటర్, కోటగుమ్మం సెంటర్, చర్చి సెంటర్, సినిమా సెంటర్ ఇలా పలుచోట్ల చోరీలు జరుగుతున్నాయి.

రద్దీ ప్రాంతాలే టార్గెట్

నిత్యం రద్దీగా ఉండే స్థానిక ఉప్పాడ సెంటర్లో రాత్రయితే చాలు నిలబడడానికి కూడా ప్రజలు భయపడుతున్నారు. స్థానికేతరులు ఎవరైనా కనిపిస్తే చాలు మాయమాటలు చెప్పి శివారు ప్రాంతాలకు తీసుకెళ్లి దోపిడీలకు పాల్పడుతున్నారు. ఇక మోటారు సైకిళ్లు అయితే చెప్పనక్కర లేదు. రోజూ రెండు, మూడు మాయమవుతున్నాయి. బాధితులు పోలీసులను ఆశ్రయించినా ఫలితం ఉండడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని ఫిర్యాదులు అందినా పోలీసులు కేసులు నమోదు చేయడం లేదని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా వీటి అదుపునకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు

ఇటీవల కాలంలో చోరీలు, దోపిడీలు జరగడం వాస్తవమే. వీటిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. ఇప్పటికే అన్ని కేసుల్లో నిందితులను పట్టుకున్నాం. విచారణ జరుతుంది. పట్టణంలో సీసీ కెమెరాలన్నీ పని చేస్తున్నాయి. వాటి ఫుటేజీల ఆధారంగానే అన్ని కేసులు దర్యాప్తు చేస్తున్నాం. సెల్‌ఫోన్ దొంగతనాలు, దారి దోపిడీ చేసిన కేసుల్లో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నాం. పట్టణంలోని ప్రధాన సెంటర్లలో ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలూ అప్రమత్తంగా ఉండాలి.

–శ్రీనివాస్, సీఐ, పిఠాపురం

మోటారు సైకిళ్లపై వస్తున్న అగంతకులు నడిచి వెళుతున్న వారి చేతుల్లో ఫోన్లు లాక్కుని పరారవుతున్నారు. కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఒకేరోజు ఆలయాల్లో చోరీలు జరిగాయి. నియోజకవర్గం దొంగతనాలకు అడ్డాగా మారిందనడానికి ఈ ఘటనలే నిదర్శనం.

పూర్తి అధికారంతో ఆదాయం పెంపు



సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్తిబాబు

సామర్లకోట: పంచాయతీల పరిధిలో సర్పంచులు, కార్యదర్శులకు పూర్తి స్థాయి అధికారం ఉంటేనే ఆదాయ వనరుల పెంపునకు అవకాశం ఉంటుందని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నాన్ లేఅవుట్ స్థలాలపై చర్యలు తీసుకునే అధికారం పంచాయతీకి ఇస్తే, వాటి రెగ్యులేషన్ చేయించుకునే అవకాశం ఇవ్వడం ద్వారా పంచాయతీల ఆదాయం పెరుగుతుందని చెప్పారు. పంచాయతీలలో రివిజన్ వ్యవస్థను తొలగించి, బిల్లు కలెక్టర్ల వ్యవస్థను తీసుకు రావడం వల్ల ఆదాయానికి గండి పడుతుందన్నారు. గ్రామాల్లో అనేక శిథిలమైన భవనాలు ఉన్నా వాటికి పన్నులు కొనసాగించడం, వాటి యజమానులు పన్నులు చెల్లించకపోవడంతో ఆదాయం తగ్గిపోతుందన్నారు. పరిశ్రమలు, ఇళ్ల ప్లాన్‌ల ఆదాయం పంచాయతీలకు వచ్చే విధంగా చూడాలన్నారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.భైరవమూర్తి అధ్యక్షత వహించగా, పంచాయతీ కార్యదర్శులు తోట సత్యనారాయణ మూర్తి, వై.శ్రీహరి శిక్షణ నిర్వహించారు.

కాలుష్యకారక పరిశ్రమలను తొలగించండి



ఉప్పాడలో మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సభ్యులు

కొత్తపల్లి: మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బంది కలిగించే కాలుష్యకారక పరిశ్రమలను తీరప్రాంతం నుంచి తొలగించాలని పౌర హక్కుల సంఘ ఉపాధ్యక్షుడు అమలదాసు బాబూరావు అన్నారు. ఇటీవల మత్స్యకారులు నిర్వహించిన ఆందోళనపై పౌర హక్కుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి నిజ నిర్ధారణ సభ్యులు శుక్రవారం ఉప్పాడలో పర్యటించి మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతంలో నిర్మించిన కాలుష్య పరిశ్రమల వల్ల సముద్ర జలాలు కలుషితమై మత్స్య సంపద లేక మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. వేట నిషేధ సమయంలో మత్స్య సంపద అభివృద్ధి చెందకపోవడంతో గత ఆరు నెలలుగా మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. ఈ కాలుష్య పరిశ్రమలతో సముద్రంలో సుమారు 20 కిలోమీటర్ల మేర సముద్ర జలాలు కలుషితమై మత్స్య సంపద దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి కాలుష్యకారక పరిశ్రమలను మూయించి వేయాలని పౌర హక్కుల సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

ప్రచారం కాదు... పనులు చేయండి

- పట్టణంలో పారిశుధ్యం అధ్వానం
- అధికారుల తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం
- సామర్లకోటలో వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



సమావేశంలో అధికారుల తీరును తప్పుపడుతున్న వైస్ చైర్మన్, సభ్యులు



సభ్యులకు సమాధానం ఇస్తున్న కమిషనర్, చైర్ పర్సన్లు

సామర్లకోట: స్వచ్ఛ సామర్లకోట – పరిసరాల పరిశుభ్రత అని ప్రచారం మాత్రం గొప్పగా చేస్తున్నారని, ముందు పారిశుధ్య పనులు పక్కా చేపట్టాలని మున్సిపల్ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. దీనికి ఇన్‌చార్జి చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి అధ్యక్షత వహించారు. పట్టణంలో సమస్యలపై చర్చించడానికి జీరో అవర్‌లో అవకాశం ఇవ్వాలని కౌన్సిలర్ కరణం రాజ్‌కుమార్ పట్టుపట్టారు. నెలకోసారి జరిగే కౌన్సిల్ సమావేశానికి అటెండర్లు హాజరు కాకపోవడం, మైక్‌లు పనిచేయక పోవడంపై వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ శాఖలో పనిచేసే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. గత నెలలో జనరేటర్ పనిచేయక సభ్యులంతా అసహనం వ్యక్తం చేసినా అధికారులకు చీమకుట్టినట్లు లేదని రెడ్నం సునీత ఆరోపించారు. పట్టణ ప్రధాన రోడ్డులో డివైడర్ల వెంబడి ఎర్ర మట్టి పేరుకుపోవడంతో చిన్న వాహనచోదకులు, నడిచి వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రాజ్‌కుమార్ అన్నారు. పారిశుధ్య వాహనాలు తరచూ ఎందుకు మరమ్మతులకు గురవుతున్నాయని ప్రశ్నించారు. డివైడర్ల వద్ద మట్టిని తొలగించడంతో పాటు, సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న అనేక మంది మస్తర్లు వేయించుకుని, వేరొకరితో పనులు చేయిస్తున్నారని కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ అన్నారు. ఇప్పటివరకూ తమ వార్డులో ఒక పని కూడా చేయలేదని 8వ వార్డు కౌన్సిలర్ పిల్లాడి సత్యవతి ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్వర్టు, డ్రైన్ పనులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఏఈ నరసింహారావు తెలిపారు. గ్యాస్ పైపులైన్ పేరుతో ఎనిమిదేళ్ల కిందట ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి సత్యనారాయణపురం వెళ్లే రోడ్డును తవ్వేశారని, దాంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారని కౌన్సిలర్ సేపెని సురేష్ అన్నారు. అక్కడ రోడ్డు నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తామని కమిషనర్ శ్రీవిద్య తెలిపారు. సత్యనారాయణపురంలో గ్యాస్ పైపులైన్ పాయింట్ ఇళ్ల మధ్య ఏర్పాటు చేయడం సరికాదని, దానిని మార్చు చేయాలని వైస్ చైర్మన్ మోజెస్ సూచించారు.

ఇంజినీరింగ్ శాఖ తీరు దారుణం

మున్సిపాలిటీ పరిధిలో ఇంజినీరింగ్ శాఖ అధికారుల పనితీరు దారుణంగా ఉందని కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, పిట్టా సత్యనారాయణ, నేతల హరిబాబు, కరణం రాజ్‌కుమార్ ఆరోపించారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లో స్థలం లేకుండా మరుగుదొడ్లు ఎక్కడ నిర్మిస్తారని, ఆ అంశంపై ఏవిధంగా ఆమోదం తెలపాలని సభ్యులు ప్రశ్నించారు. కార్తిక మాసంలో భక్తులు స్నానాలు చేయడానికి సదుపాయాల కోసం రూ.4.20 లక్షలు కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆదాయం ఆలయానికి వస్తుందని, ఈ మేరకు దేవదాయ శాఖ భక్తులకు సౌకర్యాలు కల్పించాలని పిట్టా సత్యనారాయణ అన్నారు. 2000 సంవత్సరంలో ఫిల్టర్ ప్లాంటు ఏర్పాటు చేయగా అప్పటి నుంచి మరుగుదొడ్లు ఏర్పాటు చేయక పోగా, నలుగురు సిబ్బంది కోసం రూ.ఐదు లక్షలతో మరుగుదొడ్లకు ఇంజినీరింగ్ శాఖ నిధులు కేటాయించడం వింతగా ఉందని సభ్యులు ఆరోపించారు. ఇళ్లకు డిజిటల్ బోర్డుల ఏర్పాటుకు రూ.7.50 లక్షలు కేటాయించడం దారుణమని సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దాంతో అజెండాలోని డిజిటల్ బోర్డులకు సంబంధించిన 46వ అంశాన్ని రద్దు చేయాలని, మరో మూడు అంశాలను వాయిదా వేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. డీఈ కె.శశిధర్, ఆర్వో నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: అచ్చంపేట నూతన సబ్ స్టేషన్ నుంచి విద్యుత్తు లైన్ల ఏర్పాటులో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా అచ్చంపేట, కొప్పవరం, పనసపాడు గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- ప్రజల తరఫున పోరాటానికి సిద్ధం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గీతావిశ్వనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్

పిఠాపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, దీనిపై ప్రజల తరఫున పోరాటం చేసేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ పిలుపునిచ్చారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆమెను శుక్రవారం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శులుగా నియమితులైన శెట్టిబత్తుల సురేష్‌కుమార్, లోడ అప్పలరాజులు మర్యాదపూర్వకంగా కలిశారు. భారీ ర్యాలీగా తరలివచ్చిన దళిత నాయకులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు గీతను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసిందన్నారు. రెండేళ్లుగా రైతు భరోసా ఇవ్వలేదని దుయ్యబట్టారు. చివరకు కేంద్రం ఇచ్చే వాటా కూడా ఇవ్వకుండా రైతులను నట్టేట ముంచిందని అన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ తరఫున పోరాటం చేస్తే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. కానీ కొన్ని ధాన్యానికి ఇప్పటికీ చాలా మంది రైతులకు డబ్బులు వేయకుండా ఇబ్బంది పెడుతుందన్నారు. పిఠాపురంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు నీతికి నిజాయితీకి నిలబడి ఉన్నారన్నారు. మున్సిపాలిటీలో దళితులపై, దళిత వాడల అభివృద్ధిపై ప్రభుత్వం కక్ష కట్టిందన్నారు. స్థానిక సంస్థల నిధులతో ఆమోదించిన పనులను కూడా ప్రభుత్వం అడ్డుకోవడం చాలా దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 16 నెలలు అవుతున్నా, ఇప్పటికీ మేనిఫెస్టోలో ఇచ్చిన పథకాలను అమలు చేయడం లేదన్నారు. పోరాటం చేయగా ఒక్క తల్లికి వందనం మాత్రం ఇచ్చిందని, అది కూడా అర్హులకు కోత పెట్టిందని విమర్శించారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల మతాలకు అతీతంగా అధకాలు అందించారన్నారు. ముఖ్యంగా మహిళలను అన్నివిధాలా ఆదుకుని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసిన ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అలాంటి పథకాలన్నింటినీ కూటమి ప్రభుత్వం నిలుదల చేసిందన్నారు. ఇలాంటి పరిస్థితిలో వైఎస్సార్ సీపీ గళం విప్పి ప్రజలకు దన్నుగా ఉండి పోరాటం చేస్తుందన్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా, ఎంత భయపెట్టినా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ప్రజల తరఫున పోరాటం చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. సమావేశంలో గండేపల్లి బాబి, ఆనాల సుదర్శన్, మాదిరెడ్డి దొరబాబు, ఉలవల భూషణం, రావుల మాధవరావు, పెనుమళ్ల నేర్లరెడ్డి, పెదపాటి రాజేష్, పెదపాటి రమేష్, ఆలపు సుధారాణి, పలువురు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అమ్మలగన్నయమ్మ దుర్గమ్మ

- కిటకిటలాడిన దుర్గాదేవి ఆలయాలు
- వైభవంగా శరన్నవరాత్ర ఉత్సవాలు



పాదగయలో శ్రీలక్ష్మీదేవిగా రాజరాజేశ్వరీదేవి



పిఠాపురంలో పురుహూతికా అమ్మవారు



వైష్ణవీ మాతగా పిఠాపురం మహాలక్ష్మి అమ్మవారు



తాటిపర్తిలో బ్రహ్మచారిణిగా అపర్ణాదేవి



సామర్లకోట పంచారామలో కామాక్షీదేవిగా..



కొమరగిరిలో సౌభాగ్య లక్ష్మీదేవిగా అమ్మవారు


పిఠాపురం: అమ్మలగన్నయమ్మ దుర్గమ్మా అంటూ ఆ శక్తి రూపిణిని భక్తులు కొలిచారు. శరన్నవరాత్ర ఉత్సవాలు, ఆపై శుక్రవారం కావడంతో దుర్గాదేవి ఆలయాలు కిటకిటలాడాయి. పిఠాపురం పాదగయ క్షేత్రంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం రాజరాజేశ్వరీదేవి అమ్మవారు శ్రీలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరీ దేవి అమ్మవారు, అష్టాదశ శక్తి పీఠాల్లో పదో శక్తి పీఠానికి అదిష్టాన దేవతైన పురుహూతికా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాడలో వేంచేసిఉన్న లలితాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. తాటిపర్తిలో అపర్ణాదేవి అమ్మవారు బ్రహ్మచారిణి అవతారంలో చిట్టి గాజుల అలంకరణలో దర్శనమిచ్చారు. రాపర్తిలో దుర్గామల్లేశ్వరి అమ్మవారి బోనాల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. 250 మంది భోనాలతో గ్రామోత్సవం నిర్వహించి, అమ్మవారికి సమర్పించారు. అనంతరం దుర్గామల్లేశ్వరి అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిఠాపురం మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

సామర్లకోటలో..


సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారిని కామాక్షీదేవిగా అలంకరించారు. స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. మహిషాసురమర్దిని అమ్మవారి ఆలయం వద్ద గణపతి, రుద్ర, సహస్ర చండీ హోమాలు నిర్వహించారు. అమ్మవారిని బంగారు కిరీటం, ఆభరణాలతో, కుమారారామ భీమేశ్వరస్వామిని వెండి ఆభరణాలతో అలంకరించారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్‌లు పూజాదికాలు నిర్వహించారు. స్థానిక పెద్దాపురం రోడ్డులోని కూరగాయల మార్కెట్ వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న కనకదుర్గమ్మ మండపంలో పూజలు నిర్వహించారు. గాంధీ చౌక్, రైల్వే క్వార్టర్స్, బళ్లమార్కెట్ సెంటర్, పెన్షన్‌లైన్లలో మండపాల వద్ద పూజలు జరిగాయి. చంద్రంపాలెం గ్రామంలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ అమ్మవార్లు మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల కార్యనిర్వహణాధికారులు సౌజన్య, విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పెద్దాపురం వర్ధులవారి వీధిలో శ్రీభువనేశ్వరి పీఠంలో భువనేశ్వరి అమ్మవారు మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ప్రత్యేక, పూజలు హోమాలు నిర్వహించారు. చదలాడలో కనకదుర్గమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు కలశ పూజ నిర్వహించారు. తొలుత మహిళలు కలశాలతో గ్రామ వీధుల్లో యాత్ర జరిపారు.

కొత్తపల్లి: స్థానిక శ్రీధర్మశాస్త్రా ఆలయంలో కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. కొమరగిరిలో బాల కనకదుర్గాదేవి అమ్మవారు సౌభాగ్య లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు.



చదలాడలో కలశాలతో మహిళల ఊరేగింపు



రాపర్తిలో దుర్గామల్లేశ్వరి అమ్మవారి బోనాలతో గ్రామోత్సవం